

సత్వరమే అర్జీల పరిష్కారం

స్పందనలో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కారించాలని జేసీ, ఏఎస్పీలు అధికారులను ఆదేశించారు. - 8లో



రాకాసిగుట్టలో చిరుత సంచారం

తవణంపల్లె మండలంలోని రాకాసిగుట్ట వద్ద చిరుత సంచారంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. - 8లో



సుఖసంతోషాలతో 'పెద్ద పండుగ'

ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి 700 మంది కార్మికులకు సంక్రాంతి కానుక కింద దుస్తులు పంపిణీ చేశారు. - 8లో

సాక్షి
చిత్తూరు
మంగళవారం । 9 । జనవరి । 2024

న్యూస్‌రీల్

సాహితీ పురస్కారాలకు రచనల ఆహ్వానం

చిత్తూరు రూరల్‌: కుప్పం రెడ్డమ్మ సాహితీ పురస్కారాలకు రచనలను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు రోజా ప్రియ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ రచయితలు 2023 వరకు వెలువరించిన నవలలు, కథల సంపుటి, చందోబద్ధ, వచన కవిత్వాలను రామ లక్ష్మీ, నర్సింగ్ హోమ్, సుందరయ్యవీధి, చిత్తూరు అనే చిరునామాకు పంపించాలని కోరారు. ఏప్రిల్ 17వ తేదిన పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

విలేజ్ క్లినిక్‌లో వైద్యసేవలకు ప్రశంస



వైద్యసిబ్బందితో కేంద్ర బృందం సభ్యులు

చౌడేపల్లె : వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ద్వారా గ్రామీణులకు సకాలంలో అద్భుతంగా వైద్యసేవలందిస్తున్నారని కేంద్ర వైద్యసేవల క్వాలిటీ అభివృద్ధి పరిశీలన బృందం సభ్యులు డాక్టర్ దీపక్, డాక్టర్ నిషా ప్రశంసించారు. సోమవారం చౌడేపల్లె మండలంలోని కొండామర్రి లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను పరిశీలించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాలకు అనుగుణంగా పేద ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, అత్యవసర సేవలను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ పరీక్షలు, పరిశుభ్రత, గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలపై రోగులను ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ అసెస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ నిరంజన్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ పూజ, ఏఎన్‌ఎంలు మీనా, లత పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కలెక్టర్‌గా శ్రీనివాసులు



చిత్తూరు కలెక్టరేట్‌: జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు రెండు రోజులపాటు విధులు నిర్వర్తించనున్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో విజయవాడలో ఎన్నికల సంఘం నిర్వహించే సమావేశంలో పాల్గొనేందుకు కలెక్టర్ షణ్మోహన్ సోమవారం బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు మంగళ, బుధవారాల్లో ఇన్‌చార్జి కలెక్టర్‌గా శ్రీనివాసులు వ్యవహరించనున్నారు.

పలువురు ఎస్‌ఐల బదిలీ

చిత్తూరు అర్బన్‌: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని 13 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జిల్లా నుంచి రమణ, సురేంద్రబాబు, పద్మావతి, సుగుణ, దాసరాజు నాయక్‌ను అనంతపురం వీఆర్‌కు బదిలీచేశారు. అలాగే తిరుపతి జిల్లా నుంచి శ్రీనివాసులు, చలపతి, గిరిబాబు, వెంకటేశ్వర్లు, హేమాద్రి, మూర్తి, గౌరీ శంకర్‌లను అనంతపురం, రామకృష్ణను చిత్తూరుకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

11న ఎన్నికల కసరత్తుపై సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల కసరత్తుపై ఈ నెల 11వ తేదీన పలువురు అధికారులతో కలెక్టర్ షణ్మోహన్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. చిత్తూరులోని జెడ్పీ సమావేశమందిరంలో నిర్వహించే సమావేశానికి ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ఆదేశించారు.

26లోపు 'మారథాన్'కు రిజిస్ట్రేషన్



వెంకటరమణ, జిల్లా సైన్స్ అధికారి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 26వ తేదీలోపు ఏటీఎల్ మారథాన్‌కు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా సైన్స్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఏటీఎల్ మారథాన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జాతీయస్థాయి ఇన్నోవేటివ్ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. www. atl. unisolve. org వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9701871545 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తం

చిత్తూరు కార్పొరేషన్‌: జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్‌శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గాలివానకు విద్యుత్ స్తంభాలు కూలిపోయినా, తీగలు తెగిపోయినా, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురైనా సరిచేసేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా స్టోర్‌లో విద్యుత్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు వర్క్‌ఆర్డర్ పెట్టి డ్రా చేసుకోవాలని సూచించారు.

అందుబాటులో ఆధునిక వైద్యం

ఒకప్పుడు ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలంటేనే ప్రజలు భయపడేవారు. సక్రమంగా వసతులు లేక రోగులు ఇబ్బంది పడేవారు. అవసరాలకు తగ్గట్టు పడకలు లేక కటిక నేల మీదే పడుకునేవారు. చిన్నపాటి అనారోగ్యానికి కూడా మందులు లేక అవస్థలు పడేవారు. సకాలంలో చికిత్సలందక పలువురు ప్రాణాలనే కోల్పోయేవారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సర్కారు దవాఖానాల స్థితిగతుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. నాడు–నేడు కింద ఆస్పత్రుల రూపురేఖలు మారిపోయాయి. ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. కార్పొరేట్ దీటుగా సకల హంగులు సమకూరాయి. ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలు అందుతున్నాయి.



- నాడు–నేడుతో మారిన ప్రభుత్వాసుపత్రుల రూపురేఖలు
- రూ.16 కోట్లతోపలమనేరు ఏరియా వైద్యశాల అభివృద్ధి
- వందపడకలతో రోగులకు విశిష్ట సేవలు
- బైరెడ్డిపల్లెలో రూ.1.55 కోట్లతో నూతన భవనం
- సర్కారు దవాఖానాలపై ప్రశంసలు కురిపిస్తున్న ప్రజలు

పలమనేరు : ప్రభుత్వాసుపత్రిలో సేవలు పేదవానికి అందని ద్రాక్షనా? శీర్షికలతో గత టీడీపీ పాలనలో తరచూ పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యేవి. చిన్న రోగానికి కూడా చికిత్స అందక పెద్దాస్పత్రులకు రెఫర్ చేసేవారు. ముఖ్యంగా పలమనేరు నియోజకవర్గంలోని ప్రభుత్వాస్పత్రుల్లో పరిస్థితులు మరింత దారుణంగా ఉండేవి. ప్రసవ నొప్పులతో వచ్చిన గర్భిణికి సేవలందలేదని ఆస్పత్రి వద్ద కుటుంబీకుల నిరసనలు.. సకాలంలో వైద్యసిబ్బంది చికిత్స చేయకపోవడంతో మృతి చెందిన వారి సాక్షిగా ప్రజా సంఘాల ధర్నాలు.. ఇవన్నీ పలమనేరు ఏరియా ఆస్పత్రి వద్ద గతంలో షరామామూలుగా జరిగే సంఘటనలు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద రూ.కోట్లు వెచ్చించి కార్పొరేట్ స్థాయిలో ఆస్పత్రిని తీర్చిదిద్దిం.

ఏరియా ఆస్పత్రిని చూద్దాం..

పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని గత టీడీపీ సర్కారు నిర్లక్ష్యం చేసింది. దీంతో కాంగ్రెస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 50 బెడ్లతో ఆస్పత్రిని ఆధునికీకరించారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కార్ ఈ ఆస్పత్రిపై పట్టించుకోలేదు. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఈ ఆస్పత్రిని వంద పడకలుగా మార్చింది. నాడు–నేడు ద్వారా ఆస్పత్రి అభివృద్ధికి 2020లో రూ.16 కోట్లు మంజూరు చేసింది. ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ కేఎంవీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ వారు శరవేగంగా పనులు పూర్తి చేశారు. త్వరలోనే ప్రజలకు ఆధునిక వసతులతో కూడిన ఆస్పత్రి అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఆస్పత్రిలోని ఐదు బ్లాకులతో పాటు అదనంగా మరో ఐదుబ్లాకులు కొత్తగా ఏర్పాటు కానున్నాయి. అందులో అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఆయుష్ విభాగం, ఐసీటీసీ, క్యాజువాలిటీ, బర్న్స్ యూనిట్, ఐసొలేషన్ వార్డ్, 21 బెడ్లతో ప్రత్యేక చిన్నపిల్లల విభాగం, పోస్ట్ ఆపరేటివ్ వార్డ్, ప్రత్యేకంగా 21 బెడ్లతో ల్యాబర్ బ్లాక్, ఓటీ కాంప్లెక్స్, రేడియాలజీ, ల్యాబ్స్, ఆర్థో, జీఎస్ అండ్ జీఎం, ఐ అండ్ ఈఎన్‌టీ పది బెడ్లు, పే రూమ్స్, బ్లడ్ బ్యాంకు, క్యాంటీన్, బయోమెడికల్ వేస్ట్, మార్చురీలు సేవలందించనున్నాయి. ఇప్పటికే ఆక్సిజన్‌ప్లాంట్ పనులు పూర్తయ్యాయి. కోవిడ్ స్పెషల్ వార్డు రోగులకు కావాల్సిన ఆక్సిజన్‌ను అందుబాటులో ఉంచారు.



నాడు పలమనేరు ఏరియా ఆస్పత్రి



నేడు పలమనేరు ఏరియా ఆస్పత్రి

వంద పడకలతో..

ఇప్పటిదాకా పలమనేరు ఏరియా ఆస్పత్రి వందపడకల ఆస్పత్రిగా పేరున్నప్పటికీ ఇన్‌పేషెంట్లకు 50 బెడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కొత్త భవనాల నిర్మాణంతో వందబెడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో రోజూ ఓపీ సగటు 500కు పైగా ఉంది. ఆస్పత్రిలో ఇన్ పేషెంట్ల సగటు 70గా ఉంది. నెలకు సగటున 70 ఆపరేషన్లు జరుగుతున్నాయి. త్వరలో భవనాలు అందుబాటులోకి రాగానే ఈ సేవలన్నీ రెట్టింపు అయ్యే అవకాశం ఉంది.

ఏడు పీహెచ్‌సీల్లో మెరుగైన సేవలు

పలమనేరు ఏరియా ఆస్పత్రితోపాటు, వి.కోట కమ్యూనిటీహెల్త్ సెంటర్, కొలమాసనపల్లె, గంగవరం, పత్తికొండ, పెద్దపంజాణి రాయలపేట, బైరెడ్డిపల్లె, తీర్థంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలున్నాయి. మండల కేంద్రమైన బైరెడ్డిపల్లెలో రూ.1.55 కోట్లతో 24 గంటలూ పనిచేసే పీహెచ్‌సీని ఇటీవలే ప్రారంభించారు. పీహెచ్‌సీల్లో రోజూ వంద నుంచి 150 దాకా ఓపీలు నమోదవుతున్నాయి. దీంతో పాటు ప్రతి పీహెచ్‌సీకీ ఓ 108, 104 వాహనాలు, ఏరియా ఆస్పత్రిలో తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ సేవలు అందుబాటులో ఉన్నాయి.



నాడు వరండాలో అవస్థలు (ఫైల్)



నేడు వార్డులో చికిత్స పొందుతున్న రోగులు



నాడు బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ (ఫైల్)



నేడు నూతన భవనంలో ఆరోగ్య కేంద్రం

ఆరోగ్య రక్షణకు పెద్దపీట



గత ప్రభుత్వాలు వైద్యరంగాన్ని పట్టించుకోలేదు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులే రోగులకు దిక్కుగా మారాయి. కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ఆరోగ్య రక్షణకు పెద్దపీట వేసింది. పలమనేరు ఏరియా ఆస్పత్రి అభివృద్ధే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. నూతన భవనాలు, అదనపు పడకలు, అత్యాధునిక పరికరాలు, అవసరాలకు తగ్గట్టు వైద్యసిబ్బంది అందుబాటులో ఉన్నారు. ప్రజలు ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేకుండా నాణ్యమైన వైద్యం అందుతోంది.

– వెంకటేగౌడ, ఎమ్మెల్యే, పలమనేరు

పకడ్బందీగా అభివృద్ధి



గత టీడీపీ హయాంలో ఉన్న ఆస్పత్రి సేవలకు ఇప్పటి వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని నేరుగా పరిశీలిస్తే ఎవరికైనా అర్థమవుతుంది. రోగులకు సకాలంలో వైద్యసేవలందేలా పకడ్బందీగా అభివృద్ధి చేశాం. ఈ విషయం ఆస్పత్రికి వచ్చిన వారికి తెలుస్తోంది. రాజకీయ దురుద్దేశాలతో ఎవరైనా ఆరోపణలు చేస్తే పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

– చెంగారెడ్డి, ఆస్పత్రి కమిటీ చైర్మన్, పలమనేరు

ప్రభుత్వాస్పత్రికే వెళుతున్నారు



గతంలో ఏ చిన్న జబ్బు చేసినా ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లేవారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పలమనేరు ఏరియా వైద్యశాలను అద్భుతంగా తీర్చిదిద్దారు. దీంతో రోగులు ఇక్కడకు వెళ్లేందుకే మొగ్గు చూపుతున్నారు. ఎప్పుడు చూసినా పలమనేరు ఆస్పత్రి రద్దీగానే ఉంటోంది. సక్రమంగా సేవలు సైతం అందిస్తున్నారు.

– మొహిద్దీన్, న్యాయవాది, పలమనేరు

తేడా తెలుస్తోంది



గతంలో ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు అందుతున్న సేవలు, భవనాలు ఎలా ఉన్నాయో చూశాం.అవే ఆస్పత్రులు ఇప్పుడు ఎంత చక్కగా అభివృద్ధి చేశారో, రోగులకు ఎలాంటి సేవలు అందుతున్నాయో చూస్తున్నాం. రెండు పాలనలకు తేడా స్పష్టంగా కనిపిస్తోంది. కోవిడ్ సమయంలో పలమనేరు ఏరియా ఆస్పత్రి ఎందరికి ప్రాణదానం చేసిందో చికిత్స పొందినవారికి తెలుసు.

– ముజ్జు, పలమనేరు

సిద్ధం.. ప్రగతి రథం

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రచారం చేపట్టేందుకు రాజన్న ప్రగతి రథాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిద్ధం చేయించారు. ఈ మేరకు ఓపెన్ టాప్ వాహనాలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఫొటోలను ఏర్పాటు చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ రంగులు వేసి ఫ్యాన్ గుర్తులను తీర్చిదిద్దారు. సంక్రాంతి పండుగ తర్వాత ప్రగతి రథాలు పరుగులు తీయనున్నట్లు పార్టీ నేతలు వెల్లడిస్తున్నారు.

– పుంగనూరు



పకడ్బందీగా 'జన భాగీదారి'



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ వరకు జన భాగీదారి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆయన క్షేత్రస్థాయి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జన భాగీదారిని విజయవంతంగా పూర్తి చేసేందుకు పటిష్ట ప్రణాళిక అమలు చేయాలన్నారు. కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత సంబంధిత ఫొటోలను వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ నెల 19వ తేదీన విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో షెడ్యూల్ మేరకు అన్ని మండలాల్లో జన భాగీదారి కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. అన్ని వర్గాల వారిని అందులో భాగస్వాములు చేయాలని కోరారు. అలాగే ఈ నెల 10వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడలు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో 23వ తేదీ వరకుపోటీలను నిర్వహించాలన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రను సూచించిన 14 మండలాల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జనరంజకంగా జగనన్న పాలన



పింఛన్ అందుకున్న వారితో మంత్రి రోజా తదితరులు

- మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు : రాష్ట్రంలో జనరంజకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని మంత్రి ఆర్‌కే రోజా కొనియాడారు. సోమవారం పుత్తూరు రూరల్ మండలం, వడమాలపేటలో నిర్వహించిన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ మీ ఇంట్లో మంచి జరిగుంటేనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండని అడిగిన దమ్మున్న ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. దేశంలో ఉత్తమ పాలన అందిస్తున్న తొలి ఐదుగురు ముఖ్యమంత్రుల్లో మన సీఎం జగనన్న ఒకరని చెప్పేందుకు గర్వంగా ఉందని వెల్లడించారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అవ్వాతాతలకు పింఛన్‌ను రూ.3వేల పెంచిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత చంద్రబాబు పాలనలో 39 లక్షల మందికి రూ.వెయ్యి వంతున పెన్షన్లు అందించేవారని, ఇందుకోసం కేవలం రూ.400 కోట్లు మాత్రమే కేటాయించేవారని తెలిపారు. ఆ వెయ్యి రూపాయలు అందుకోవడానికి కార్యాలయాల వద్ద బారులు తీరి కాళ్ల నొప్పులతో కన్నీళ్లు పెట్టుకొన్న అవ్వాతాతలెందరినో చూశామని ఆవేదన వ్యక్తం చేశారు. అదే ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో ఒకటో తారీఖునే లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి వలంటీర్లు ఫించన్ అందిస్తున్నారని తెలిపారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 66.34 లక్షల మందికి రూ.3 వేలు వంతున నెలకు రూ.1,968 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే ఇది దాదాపు 5 రెట్లు ఎక్కువన్నారు. ఒక్క నగరి నియోజకవర్గంలోనే మొత్తం లబ్ధిదారులు 38,915 మందికి రూ.11.51 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. బాబు పాలనలో ఎవరో ఒక పింఛనుదారుడు చనిపోతేనే కొత్త పెన్షన్ మంజూరు చేసేవారని, అదీ జన్మభూమి కమిటీ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండేదన్నారు. అదే నేటి జగనన్న పాలనలో అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నామని వెల్లడించారు. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు స్కామ్‌లతో ప్రజాధనాన్ని యథేచ్ఛగా దోచేసి, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఏనాడూ కుంటిసాకులు చెప్పకుండా ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చారని తెలిపారు. స్కాముల బాబును రాష్ట్రం నుంచి తరిమికొట్టి, సంక్షేమ ప్రదాత జగనన్నను నిండు మనసుతో ఆదరించాలని కోరారు. తనకు నగరి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని విన్నవించారు. పుత్తూరు కార్యక్రమంలో తహసీల్దార్ పరమేశ్వరస్వామి, ఎంపీడీఓ ప్రసాద్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీలు మునస్వామిరెడ్డి, విమల, పార్టీ రూరల్ మండలం అధ్యక్షుడు గోవిందస్వామిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్ పాల్గొన్నారు. వడమాలపేట కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీపీ విజయలక్ష్మీ, వైస్ ఎంపీపీ లోకేష్, పార్టీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి, శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, కిరణ్‌కుమార్, కరుణాకర్ చౌదరి, సుధీర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, పరందామరెడ్డి, శేఖర్, వెంకట్‌రెడ్డి, ఉమాపతి, రాజశేఖర్, రాజేందర్, మునెమ్మ, శ్రీవిద్య, ప్రభుదాస్, రవిరాజు, రమేష్ పాల్గొన్నారు.

సడలని సంకల్పం..సమరోత్సాహం!



అదే సంకల్పం.. తరగని ఉత్సాహం.. మదిలో మెదలాడే నాటి జ్ఞాపకాల నుంచి పురుడు పోసిన నవరత్నాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతూ.. సమరోత్సాహంతో ముందుకు సాగుతున్నారు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర నేటితో ఐదేళ్లు పూర్తి చేసుకుంది. ఉమ్మడి జిల్లాలో 29 రోజులు సాగిన పాదయాత్రకు జనం నీరాజనాలు పట్టారు. – తిరుపతి సిటీ



క్లుప్తంగా

ఒంటరి ఏనుగు బీభత్సం



ధ్వంసమైన ఇల్లు

పెద్దపంజాణి : మండలంలోని పెద్దకాప్పల్లెలో సోమవారం వేకువజామున ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. సుందరప్ప అనే రైతు తన పొలంలోని ఇంట్లో పశు దాణా నిల్వ చేసుకున్నాడు. ఈ క్రమంలో ఏనుగు ఇంటి గోడలను ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించింది. రైతు నిల్వ చేసుకున్న పశుదాణాలను పూర్తిగా ఆరగించేసింది. బాధితుడి కేకలు విన్న గ్రామస్తులు బాణ సంచా పేలుస్తూ అతి కష్టం మీద ఏనుగును దారి మళ్లించారు. అటవీశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఏనుగులను కట్టడి చేయాలని, తనకు నష్ట పరిహారం మంజూరు చేయించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

చెట్టును ఢీకొన్న కారు



ధ్వంసమైన కారు

పాలసముద్రం : మండలంలోని షోలింగర్–పళ్లిపట్టు జాతీయ రహదారిపై సోమవారం ఓ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న తమిళనాడు వాలాజ గ్రామానికి చెందిన గుణశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని 104 వాహనంలో షోలింగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చప్పిడిపల్లెలో మరో పసుపు డ్రామా!

- సీఎం సహాయనిధి రాలేదంటూ మాజీ మంత్రి ముందు హంగామా
- ఆరోగ్యశ్రీ జాబితాలోని వ్యాధులకు సీఎంఆర్ఎఫ్ ఇవ్వరని తెలిసినా..
- ఆరోగ్యశ్రీ జాబితాలో లేని ఆస్పత్రిలో చికిత్స, ఆపై ప్రభుత్వంపై నింద



నా బిడ్డకు సీఎంఆర్ఎఫ్ రాలేదని మాజీ మంత్రి ముందు చెబుతున్న శంకరయ్య

పలమనేరు : గత కొన్నాళ్లుగా పలమనేరు నియోజకవర్గంలో మాజీమంత్రి అమరనాథ రెడ్డి ఇంటింటికీ తెలుగుదేశం పేరిట వెళుతున్నారు. ఈ సందర్భంగా నిత్యం ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనం చేత చెప్పించి దాన్ని వీడియో తీసి సోషల్ మీడియా కెక్కించడం వారికి షరా మామూలుగా మారింది. ఇదే రీతిన బైరెడ్డిపల్లె మండలం చప్పిడిపల్లెలో మాజీ మంత్రి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆ పార్టీకే చెందిన శంకరయ్య కుమార్తెకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయం అందలేదంటూ గట్టిగా చెప్పించారు. కానీ ఈ విషయంలో వాస్తవాలేమిటంటే..

గ్రామానికి చెందిన శంకరయ్య ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇతని కుమార్తె బిందు(15) మూడేళ్ల క్రితం క్యాన్సర్ బారిన పడింది. దీంతో వీరు స్థానిక ఆస్పత్రిలో ఆరోగ్యమిత్రను సంప్రదించకుండానే బాలికను తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు సీఎంసీలో చేర్పించి వైద్యం అందించారు. ఆపై తాము రూ.లక్షల్లో ఆస్పత్రికి బిల్లు చెల్లించామంటూ ఆ పంచాయతీకి చెందిన నాయకుల ద్వారా స్థానిక ఎమ్మెల్యే సిఫారసు లేఖతో సీఎంఆర్ఎఫ్‌కు పంపారు. అయితే ఆరోగ్యశ్రీ జాబితాలోని వ్యాధులకు సీఎం రిలీఫ్‌ఫండ్ రాదనే విషయం బాధితునికి తెలిదు. మరోవైపు ఇతర ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకున్నాక ఆస్పత్రిలో డిశ్చార్జి అయ్యాక మూడు నెలల్లో సీఎం ఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ సంబంధిత దరఖాస్తుదారు 2020లో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. 2022 జనవరిలో దరఖాస్తు చేసుకోవడంతో సీఎం కార్యాలయం నుంచి తిరస్కరణకు గురైనట్టు స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ వ్యక్తిగత కార్యదర్శి తేజ తెలిపారు. ఇలా ఉండగా ఈ విషయమై బైరెడ్డిపల్లె మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయచందర్‌ను విచారించగా బిందు అనే బాలిక తమ ద్వారా చికిత్సలు చేయించుకోలేదన్నారు. తమని సంప్రదించి ఉంటే రాజీవ్ ఆరోగ్యశ్రీ ప్యానెల్ ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించేవారమని తెలిపారు. ఈ నిజాలు తెలుసుకోకుండా మాజీమంత్రి అండ్‌కో బాధితున్ని పావుగా చేసుకుని ప్రభుత్వంపై నిందలు వేసేలా వీడియో చిత్రీకరించడం కొసమెరుపు.



బైరెడ్డిపల్లె మెడికల్ ఆఫీసర్ విజయచందర్

సుఖసంతోషాలతో 'పెద్ద పండుగ'



కార్మికురాలికి కానుకను పంపిణీ చేస్తున్న విజయానందరెడ్డి

- ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి
- 700 మంది కార్మికులకు సంక్రాంతి కానుక

చిత్తూరు రూరల్: పెద్ద పండుగను అందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఆకాంక్షించారు. సోమవారం చిత్తూరు కొంగారెడ్డిపల్లిలోని తన కార్యాలయంలో నగరపాలకసంస్థ పరిధిలో పని చేసే పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగంలోని 700 మంది కార్మికులకు సంక్రాంతి కానుకను అందజేశారు. ఒక్కొకరికి రూ.1,500 విలువైన దుస్తులను పంపిణీ చేశారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో తన వంతు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. భగవంతుని ఆశీస్సులతో ప్రజాసేవను కొనసాగిస్తున్నామని వెల్లడించారు. అనంతరం ఆయనను పలువురు కార్మికులు సత్కరించారు.

మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ

చంద్రగిరి: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఉచితంగా కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 తేదీ నుంచి 30 రోజుల పాటు మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగి తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19–45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, కనీసం పదో తరగతి చదువుకున్న నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, రాను, పోను ఒకసారి బస్సు ఛార్జీలు ఇవ్వడంతోపాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకోదలచిన వారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జెరాక్స్, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో నేరుగా సంస్థ వద్దకు వచ్చి వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఒక్క బ్యాచ్‌కు 25–30 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ముందుగా నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థ, ద్వారకానగర్, కొత్తపేట, చంద్రగిరి, లేదా 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సత్వరమే స్పందన అర్జీల పరిష్కారం



అర్జీ స్వీకరిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: వివిధ సమస్యలపై స్పందనలో ప్రజలు అందించే అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఆయన అర్జీలు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ స్పందనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. వినతులను నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: స్పందనలో ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మీ ఆదేశించారు. సోమవారం చిత్తూరులోని ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 25 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు.

22న ఓటరు తుది జాబితా ప్రచురణ



వీడియోకాన్ఫరెన్స్‌లో జేసీ, డీఆర్‌ఓ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఓటరు తుది జాబితాను ఈ నెల 22వ తేదీన ప్రచురించనున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ ఓటరు అభ్యంతరాలను ఈ నెల 12వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను మరోసారి పరిశీలించాలని సూచించారు. అలాగే అసైన్‌మెంట్ భూముల కసరత్తులో ఈకేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో డీఆర్‌ఓ రాజశేఖర్, ఆర్డీఓలు చిన్నయ్య, సుజన, మనోజ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రభుత్వ వైద్య కళాశాల మరియు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, మదనపల్లి నందు కాంట్రాక్టు మరియు అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఖాళీల భర్తీ కొరకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించడమైనది. ఖాళీల వివరముల కొరకు వెబ్‌సైట్ https://chittoor.ap.gov.inని సందర్శించండి.

ప్రిన్సిపాల్
ప్రభుత్వ వైద్య కళాశాల,
మదనపల్లి

కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ & చైర్మన్
జిల్లా ఎంపిక కమిటీ, చిత్తూరు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ, జనసేన యువత



ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ, జనసేనకు చెందిన యువకులు

కుప్పంరూరల్: మండలంలోని యనమనాశనపల్లె, పరకుంట్లపల్లె గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీలో ఉన్న 40 మంది యువకులు సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశం అనంతరం రాత్రి టీడీపీ, జనసేనల నుంచి 40 మంది యువకులు ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో పార్టీలో చేరారు. వెంకటేష్, మురుగేష్, మురళి, నవీన్, ప్రభాకర్, శివ, సుబ్రమణ్యం, ఎర్రప్ప, సుధా, నరసింహులు, మునెప్ప, మునిరాజుతో కలిపి 40 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు పారదర్శకంగా అందిస్తున్నారని, పేదలు ఈ ప్రభుత్వ హయాంలో సుభిక్షంగా ఉన్నారని, అందుకే జగన్‌కు మద్దతు ఇవ్వాలని పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఏడీఎస్ శరవణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగుల కల నెరవేరింది



టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న టీటీడీ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు, సభ్యులు

తిరుపతి(అలిపిరి): ఎన్నో ఏళ్ల నాటి టీటీడీ ఉద్యోగుల కల నెరవేరిందని, ఇందుకు సహకారం అందించి టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డికి టీటీడీ హౌసింగ్ సొసైటీ యూనియన్ అధ్యక్షుడు గంపల వెంకట రమణారెడ్డి సొసైటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. చరిత్రలో కనీవిని ఎరగని రీతిలో వేల మంది ఉద్యోగులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం గర్వంగా ఉందని, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేసిన కరుణాకరరెడ్డికి రాబోయే ఎన్నికల్లో సహకారం అందించి రుణం తీర్చుకుంటామని పేర్కొన్నారు. అనంతరం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి జ్ఞాపిక అందజేసి, సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి గొల్కొండ వెంకటేశన్, కోశాధికారి ప్రసాద్‌రావు, టి.భాస్కర్, మునిరెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువజన క్రీడోత్సవం



మైదానంలో క్రీడాకారుల సందడి

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా పోటీలను నిర్వహించారు. జిల్లా యువజన సర్వీస్ సీఈఓ మురళీకృష్ణారెడ్డి పోటీలను ప్రారంభించారు. సీఈఓ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకొని క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. బాల,బాలికలకు వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథరెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డి, పీడీలు కృష్ణ, ఢిల్లీరాణి పాల్గొన్నారు.

నేటి నుంచి సంక్రాంతి సెలవులు



విజయేంద్రరావు, డీఈఓ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు 9 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు మంజూరు చేసినట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలను 19వ తేదీన పునఃప్రారంభించుకోవచ్చన్నారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల అనుమతులు సైతం రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు డీవైఈఓ, ఎంఈఓలు పకడ్బందీగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

267 ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె : అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 267 ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ కాలేజ్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్.ఎంవీ మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో 13 కేటగిరీలకు 65 ఖాళీలు, ప్రభుత్వ జిల్లా జనరల్ ఆస్పత్రిలో 29 కేటగిరీలకు 202 పోస్టులు ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి జనవరి 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు చిత్తూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేటగిరీ, అర్హత, ఇతర వివరాలు వెబ్‌సైట్‌లోనే ఉంచామన్నారు.

రాకాసిగుట్టలో చిరుత సంచారం



చిరుత కాలి గుర్తులు పరిశీలిస్తున్న ఫారెస్టు సిబ్బంది

తవణంపల్లె : మండలంలోని జొన్నగురకల వద్ద రాకాసిగుట్టలో చిరుత సంచారంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళుతున్న వినాయకం అనే వ్యక్తి చిరుతను చూసినట్లు గ్రామస్తులు వెల్లడిస్తున్నారు. వెంటనే వలంటీరు అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఈ క్రమంలో శెట్టేరి బీటు ఎఫ్‌బీఓలు రాకాసిగుట్ట వద్దకు వెళ్లి చిరుత అడుగు జాడలను పరిశీలించారన్నారు. అయితే వర్షం కురువడంతో గుర్తులు పోయినట్లు అటవీ సిబ్బంది చెప్పారు. జొన్నగురకల, పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



• రాములోరి ఆహ్వానం

అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి టీటీడీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి ఆహ్వానం అందింది. సోమవారం రామమందిరం ప్రతినిధులు టీటీడీ చైర్మన్ భూమన నివాసానికి వచ్చి ఆహ్వాన పత్రికను అందించారు. ఈనెల 22న రామమందిర ప్రారంభోత్సవానికి విచ్చేయాలని సూచించారు.

తిరుపతి మంగళం

టీటీడీ చైర్మన్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న రామమందిరం ప్రతినిధులు

తిరుమలలో వృద్ధురాలి మృతి

తిరుమల: తిరుమలలోని భయంకర్ మఠంలో ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. రాజస్థాన్, జైపూర్‌కు చెందిన ప్రేమ్‌కాంత మేతీ(71) శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు చేరుకుని స్థానిక భయంకర్ మఠంలో వసతి గదిని పొందారు. ఉదయం కుటుంబ సభ్యులు ఆమెను లేపేందుకు ప్రయత్నించగా లేవలేదు. దీంతో ఆమెను హుటాహుటిన టీటీడీ అశ్విని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ప్రేమ్‌కాంత మేతీ మృతదేహాన్ని స్వస్థలానికి తరలించేందుకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వృద్ధురాలి మృతిపై పోలీసులు విచారణ చేపట్టారు. కుటుంబసభ్యులు, చుట్టుపక్కల గదుల్లో వారిని విచారించారు. ప్రేమ్‌కాంత మేతీది సాధారణ మరణంగానే నిర్ధారించారు. ఆ మేరకు మృతదేహం తరలింపునకు అనుమతి ఇచ్చారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ 3 నెలల్లో Diploma/ B.Tech/ LLB/ BL/ Part Time - అన్ని Govt. Jobs కు Eligible, Exams-Feb-2024. గ్యారెంటీ పాస్‌కై కృషి. 7995053670, 9550271042.

DIRECT FINAL YEAR

■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

Services

TOURS & TRAVELS

■ నర్మదా నది పుష్కర యాత్ర 08.05.2024, 4 రోజులు ఉజ్జయిని, ఓంకారేశ్వరం, మహంకాళి శక్తి పీఠం టికెట్ ఒక్కొంటికి 5000/- ST ట్రావెల్స్. 98858 53240

Wanted

■ Wanted Teachers Primary Section, Higher Maths, Hostel Wardens, Computer Faculty, Attractive Salary, S.N.Puram, Tirupati, ✆ 9290898331, 7013881383.

■ ఇంటర్ డిగ్రీ చదివిన కొద్దిగా లేదా పూర్తిగా కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన స్త్రీలు, పురుషులు కావలెను. జీ:15,000, తిరుపతిలో పనిచేయుటకు కావలెను. ✆ 7396016024.

■ శ్రీ లక్ష్మి మోటార్ మహీంద్రా షోరూం (వరదయ్యపాళెం, పిచ్చాటూరు, B.N.కండ్రిగ, నాగలాపురం)లో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 9100047502.

■ ఆఫీస్ బాయ్ & ప్యాకింగ్ హెల్పర్ &PF,ESI, 4 Week Off సెక్యూరిటీ గార్డ్స్ జీతం: 11,000, Near M.R.పల్లి సర్కిల్ నందు తిరుపతిలో పనిచేయుటకు. 8904040900, 7780476691.

■ తిరుపతి జిల్లాలో కొత్తగా ప్రారంభించిన మా యాడ్ ఏజెన్సీ ఆఫీస్‌లో జాబ్ చేయుటకు 35 స్త్రీ/పుల కావలెను. జీ:14వేలు+DA8వేలు+ఫ్రీ వసతి, భోజనం. Q:10th-డిగ్రీ, (P/F). సింధూ ప్రమోషన్స్. 99085 66508.

■ తిరుపతి హోమ్ హెల్త్ కేర్ సర్వీసెస్. శ్రీ మంతుల ఇళ్ళలో పేషెంట్స్‌ను చూసుకొనుటకు ఆడ,మగ స్టాఫ్ కావలెను. జీ:15000/- to 25,000/- ఫ్రీఫుడ్+రూమ్. 9010996737, 9392442511

■ నగరంలోని ఒక ప్రముఖ హోటల్లో పనిచేయుటకు మార్కెటింగ్ సిబ్బంది, క్యాషియర్ కావాలి (ఆడవాళ్లకు మాత్రమే) అనుభవం జీతం ఇవ్వబడును. 9989664113, 9642467888.

■ Office Job-2, Field-2, వంటవాళ్ళు -3, Helpers-2, జీ:10 to 20,000+, డీలర్/ ఏజెంట్స్ / షాప్/ రూమ్ ఉన్న వారికి అధిక ఆదాయం. 9390900977.

■ తిరుపతి, కొర్లగుంటలోని టైలరింగ్ కంపెనీలో పనిచేయుటకు టైలర్లు మరియు ప్యాకింగ్ కోసం మహిళలు కావలెను. సంప్ర: 9246991550.

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926

■ Wanted Female Telecallers & Admin Working in Tirupati. Qualification : Inter / Degree. For More Details Contact: 88854 11142, 94935 17185.

■ రేణిగుంట ఫ్యాక్టరీలో పనిచేయుటకు ASO/SG కావలెను. జీతం నెలకు/ 8 గంటలకు /14769/13089, ESI, PF కలదు. సెల్ నెం: 7993290289, 7075807706

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573833520, 9059633520.

■ ఉచితంగా కావలెను. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ : 15000 -40000. ఫ్రీ రూమ్+భోజనం. Hyd. 9391753308

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా యాడ్స్ పంపిస్తూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 7702518530, 8019341329.

లైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపిన లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించాలి.